ప్రజాశక్తి

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నామినేషన్ల పర్వం ఆరంభం

- తొలి రోజు విశాఖ పార్లమెంటుకు 3, అసెంబ్లీ స్థానాలకు 8
- అనకాపల్లి పార్లమెంట్‌కు 1, అసెంబ్లీ స్థానాలకు 6

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం ఆరంభమైంది. గురువారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు పలువురు అభ్యర్థులు కోలాహలం నడుమ నామపత్రాలు దాఖలు చేశారు. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గానికి తొలి రోజు ముగ్గురు నామినేషన్లు ధాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం ఉదయం కలెక్టర్ ఛాంబరులో పార్లమెంట్ అభ్యర్థుల నుండి నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారి, పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి స్వీకరించారు. స్వతంత్ర అభ్యర్థిగా వడ్డీ హరి గణేష్ తొలి నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారికి అందజేయగా, రెండో నామినేషన్‌ను ప్రజాశాంతి పార్టీ నుంచి కెఎ.పాల్ సమర్పించారు. మూడో అభ్యర్థిగా పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున పొలమరశెట్టి సత్యవతి నామినేషన్‌ను దాఖలు చేశారు. జిల్లా రెవిన్యూ అధికారి, ఎఐఆర్ఒ కె.మోహన్ కుమార్ నామినేషన్ల ప్రక్రియ జరిపించారు.

టిడిపి భీమిలి నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న గంటా శ్రీనివాసరావు

అలాగే విశాఖ జిల్లాలోని నాలుగు శాసనసభ నియోజకవర్గాల్లో ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. భీమిలి శాసనసభ నియోజకవర్గం నుంచి గంటా శ్రీనివాసరావు, గంటా రవితేజ తెలుగుదేశం పార్టీ నుంచి రెండేసి సెట్లను భీమిలి రిటర్నింగ్ అధికారి ఎస్.భాస్కర్ రెడ్డికి అందజేశారు. విశాఖపట్నం ఉత్తరం శాసనసభ నియోజక వర్గం నుంచి నవభారత్ నిర్మాణ సేవా పార్టీ తరపు అభ్యర్థిగా చింతాడ సూర్యం తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి డి.అఖిలకు అందజేశారు. జాతీయ జనసేన పార్టీ నుంచి పి.జగదీష్ నామినేషన్ వేశారు. గాజువాక నియోజకవర్గం నుంచి జాతీయ జనసేన పార్టీ తరపున పల్లి శ్రీనివాసరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున పెబ్బిలి సత్యనారాయణ మూర్తి, పెందుర్తి నియోజకవర్గం నుంచి బంగారి రమణ బహుజన మిగతా 2లో..

గంటా ఆస్తులు అంతంతేనట..!

- ప్రత్యూష కంపెనీ వేలంలో ఉందని అఫిడవిట్‌లో వెల్లడి
- పలుచోట్ల కేసులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మాజీ మంత్రి, భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు పెద్ద ఆస్తిపరుడు కాదన్నట్టు ఆయన సమర్పించిన అఫిడవిట్ వివరాలున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ఆస్తులను బట్టి ఎగువ మధ్యతరగతి కిందకు వస్తారు. ఇక ఆయన ఆస్తులు, రుణాల విషయంలోకి వస్తే.. సార్వత్రిక ఎన్నికలకు భీమిలి నియోజకవర్గం నుంచి జనసేన, టిడిపి, బిజెపి కూటమి తరపున టిడిపి అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అందులో ఆయనకు, ఆయన సతీమణికి మొత్తంగా వున్న ఆస్తులు కేవలం రూ.10 కోట్లేనని ఒకచోట చూపారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆయన గురువారం సమర్పించిన అఫిడవిట్‌లో పలు అంశాలను ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన ఆస్తులకు సంబంధించి రూ.7,89,070 ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించానని, భార్య జి.శారద ఆస్తులకు సంబంధించి రూ.4,44,470 ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించామని పేర్కొన్నారు. తనపై అనకాపల్లి, ఎంవిపి.కాలనీ, కంచరపాలెంల్లో కేసులు ఉన్నట్టు తెలిపారు. ఏ కేసుల్లోనూ తనకు శిక్ష విధించబడలేదని పేర్కొన్నారు. ఇక ఆయన ఆస్తుల వివరాలకు వస్తే నగదు ఆయన వద్ద 2 లక్షలు, ఎంవిపి.కాలనీ ఐసిఐసిఐ బ్యాంకులో రూ.39,36,542, ఎంవిపి.కాలనీలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో రూ.10,68,158, హైదరాబాద్ సెక్రటేరియట్ బ్రాంచ్‌లో రూ.2,97,018, ప్రకాశం జిల్లా కామేపల్లి యూనియన్ బ్యాంక్‌లో రూ.1,571, న్యూఢిల్లీలోని ఎస్‌బిఐ పార్లమెంట్ హౌస్ బ్రాంచిలో 1,67,340, మరొక వ్యక్తిగత హెచ్‌డిఎఫ్‌సి బ్రాంచిలో రూ.40,00,000 నగదు ఉందని గంటా పేర్కొన్నారు.

భార్యవద్ద వున్న నగదు వివరాలు

అదే విధంగా తన సతీమణి శారద వద్ద నగదు రూ.2 లక్షలు, ఎంవిపి.కాలనీ ఐసిఐసిఐ బ్యాంక్ నందు రూ.4,66,081, విశాఖపట్నం కొటక్ మహేంద్ర బ్యాంక్ నందు రూ.13,672 ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా రెండు ఎల్ఐసి పాలసీలు, బాండ్లు, ఇతర షేర్ల విలువ కలుపుకొని రూ.7,32,48,620గా పేర్కొన్నారు.

సన్ విద్యాసంస్థ ఆదాయం

అంతేగాకుండా సాగర్ నగర్‌లోని సన్ ఎడ్యుకేషనల్ సంస్థ ద్వారా రూ.15,00,000, శానిటరీ ఫార్మ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో రూ.13,28,821 నిధులు తమ అధీనంలో ఉన్నాయని పేర్కొన్నారు. వీటితో పాటు రూ.2.4 కోట్ల బంగారు ఆభరణాలు మిగతా 2లో..

ఐక్యమత్యంతో పోరాటం ముందుకు

వార్త 8లో..

చిన్నారుల ఆటవిడుపునకు వేసవి శిబిరాలు

వార్త 2లో..

నిరుద్యోగ యువతను మోసం చేసిన మోడీ

వార్త 8లో..

డైలమాలో పైలా

పైలా ప్రసాదరావు

- స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచే అవకాశం
- మాడుగుల టికెట్ బండారుకు ఇవ్వడంపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావుకు తీరని అవమానం జరిగింది. పొత్తులో పెందుర్తి టికెట్‌ను కోల్పోయిన టిడిపి సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణ మూర్తిని సంతృప్తి పర్చేందుకు టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావును మార్చేశారు. నామినేషన్ల స్వీకరణకు ముందురోజు మాడుగుల నుంచి పోటీ చేసేందుకు సిద్ధంకావాలని బండారుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సూచించారు. శుక్రవారం నామినేషన్ వేసేందుకు ప్రసాదరావు పార్టీ శ్రేణులను సిద్ధం చేసుకున్నారు. బుధవారం బండారుకు బాబు ఫోన్ చేసి మాడుగుల నుంచి పోటీ చేయాలని సూచించినట్లు దావానంలా వార్త వ్యాపించడంతో పైలా ఖంగుతున్నారు. ప్రస్తుతం తన పోటీపై డైలమాలో ఉన్నారు.

మార్పు వెనుక..

పెందుర్తి టికెట్ రాలేదని అలిగి బండారు ఇంట్లో కూర్చొన్నారు. ఇటీవల పాయకరావుపేట, గాజువాక ప్రజాగళం సభకు వచ్చిన చంద్రబాబు సభ తరువాత బండారు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుతో విడివిడిగా విమానాశ్రయంలో మాట్లాడి సర్ది చెప్పారు. బండారు తనకు టికెట్ ఇవ్వాలని పట్టుబట్టడంతో ఒక దశలో బాబు అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరిగింది. మాడుగుల టికెట్ తనకు ఇవ్వలేదన్న బాధ కంటే, పైలాకు టికెట్ ఇవ్వడం మనస్తాపం చెందుతున్నట్లు చంద్రబాబు వద్ద గవిరెడ్డి వాపోయారు. మాడుగుల టిడిపిలో నాయకత్వ సమస్యలను బాబు దష్టికి అనకాపల్లి బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ తీసుకెళ్లినట్లు తెలిసింది. ప్రసాదరావుకు గవిరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పివిజి.కుమార్ సహకరించే పరిస్థితి లేనందున అభ్యర్థిని మార్చాలన్న రమేష్ సూచనతో బాబు తన ఆలోచనను మార్చుకొని పైలా స్థానంలో బండారును బరిలోకి దించాలన్న నిర్ణయానికి వచ్చారు. బాబుతో రమేష్‌కు ఉన్న సాన్నిహిత్యం దృష్ట్యా ఆయన చెప్పిన మాటను చంద్రబాబు కాదనలేకపోయిన్నట్టు ప్రచారం సాగుతోంది.

మాడుగుల నియోజకవర్గంలో చంద్రబాబు ఆది నుంచీ తప్పటడుగులు వేస్తున్నారు. గవిరెడ్డిని కాదని పివిజి కుమార్‌కు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు మిగతా 2లో..

వాల్తేర్ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వాల్తేర్ డివిజన్‌లోని కోరాపుట్-రాయగడలైన్‌లోని టికిరి-సింగారం-లక్ష్మీపూర్ రోడ్డు మధ్య డబుల్ లైన్‌ను ప్రారంభించేందుకు ప్రీ నాన్-ఇంటర్‌లాక్, నాన్-ఇంటర్‌లాక్ పనుల కారణంగా పలు రైళ్ల రద్దు, కొన్నింటి గమ్యస్థానాల్లో మార్పులు చేసారు. 18512 విశాఖపట్నం-కోరాపుట్ బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 29,మే 3, 6 తేదీల్లోనూ, 18511 కోరాపుట్ - విశాఖపట్నం బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 30, మే 4,7 తేదీల్లో రద్దు చేసారు. అదేవిధంగా 08546 విశాఖపట్నం - కోరాపుట్ ప్యాసింజర్‌ను ఏప్రిల్ 28 మే 8 వరకు, ఆలాగే 08545 కోరాపుట్ - విశాఖపట్నం ప్యాసింజర్‌ను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నామినేషన్ల పర్వం ఆరంభం

సమాజ్ పార్టీ తరపున ఒక్కో నామినేషనును దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు.

అనకాపల్లి జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి తొలిరోజు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. అనకాపల్లి లోక్‌సభకు ఒక నామినేషన్ గురువారం దాఖలైంది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు మొదటి రోజు నామినేషన్ వేయడానికి ఆసక్తిచూపలేదు. అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట, మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాలకుగానూ అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం నుంచి ఆరుగురు నామినేషన్లు వేశారు. యలమంచిలి నుంచి జనసేన అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పొలమరశెట్టి అంబికాదేవి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), సూదికొండ మాణిక్యాలరావు (బిఎస్‌పి), యలమంచిలి నుంచి సుందరపు విజయ్‌కుమార్ (జనసేన), బోను నాగేశ్వరరావు (ఆర్‌పిఐ), నర్సీపట్నం నుంచి రాయపురెడ్డి భద్రాచలం (స్వతంత్ర), నాగరాను బొట్ట (బిఎస్‌పి) నామినేషన్ దాఖలు చేశారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ఎస్‌కె సఫి వుల్లా కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలుచేసినప్పటికీ బి.ఫారం సమర్పించకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి పట్టాన్‌శెట్టి పరిగణించారు. ముహూర్తాలు చూసి అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో ప్రధాన పార్టీల నుంచి నామినేషన్లు రాలేదు. శుక్రవారం నుంచి వైసిపి, టిడిపి, జనసేన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేయనున్నారు.

గంటా ఆస్తులు అంతంతేనట..!

ఉన్నాయని తెలిపారు. అన్నింటినీ కలుపుకొని గంటా శ్రీనివాసరావు ఆస్తులు రూ.8,39,87,421, ఆయన సతీమణి జి.శారద ఆస్తులు విలువ రూ.2,96,84,154గా ఉన్నాయని ఆయన ధ్రువీకరించారు.

స్థిరస్తులు ఇలా..

స్థిరాస్తులకు సంబంధించి పలు ప్రాంతాల్లో ఉన్న భూముల విలువ రూ.7,90,66,539 ఉందని అదే విధంగా సతీమణి జి.శారద పేరుతో రూ.4,09,49,512 విలువగల స్థిరాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా కామేపల్లి యూనియన్ బ్యాంకులో రూ.29,97,624 వ్యవసాయ రుణం, ఐసిఐసిఐ బ్యాంక్ ఎంవిపి.కాలనీ బ్రాంచిలో సతీమణి పేరిట రూ.85,80,571 బంగారంపై రుణం ఉందని ఆయన పేర్కొన్నారు. గంటాకు చెందిన ప్రత్యూష కంపెనీ గురించిన వివరాలు నామమాత్రంగా ఉన్నాయి. ఆ కంపెనీ వేలంలో ఉందని, దానికి గ్యారెంటీగా తాను ఉన్నానని పేర్కొన్నారు. అలాగే తనపేరుమీదా, సతీమణి పేరుమీదా నాలుగు బ్యాంకుల్లో ఏడు కోట్ల పైచిలుకు రుణం ఉన్నట్టు అఫిడవిట్‌లో తెలిపారు.

గంటా తనయుని ఆస్తుల వివరాలివే..

తెలుగుదేశం పార్టీ తరపున మరొక నామినేషన్‌ను దాఖలు చేసిన గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ సమర్పించిన అఫిడవిట్‌లో తన వద్ద నగదు నిల్వలు రూ.47,11,644, తన భార్య శారని వద్ద నగదు నిల్వలు రూ.7,30,90,278గా ఉన్నాయని పేర్కొన్నారు అదేవిధంగా స్థిరాస్తులకు సంబంధించి అతని వద్ద 11,91,40,790, అతని భార్య వద్ద 7,98,96,782 విలువగల స్థిరాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు బ్యాంకుల్లో ఉన్న రుణ సమాచారాన్ని పొందుపరిచారు. తనపై ఎటువంటి కేసులూ నమోదు కాలేదని అఫిడవిట్‌లో స్పష్టం చేశారు

డైలమాలో పైలా

అప్పగించారు. తనకు టికెట్ వస్తుందన్న ఆశతో ఉన్న కుమార్‌ను కాదని పైలాను టిడిపి అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో కొంతకాలం దూరంగా ఉన్న గవిరెడ్డి, పివిజి దగ్గరయ్యారు. వీరిద్దరూ ఎన్నికల్లో పైలాకు సహకరించే పరిస్థితి కనిపించకపోవడంతో బండారును తెరమీదకు తీసుకొచ్చారు. మాడుగుల నాయకత్వంతో సంప్రదింపులు చేసుకోవడానికి బండారు గురువారం మోదకొండమ్మ దర్శనం పేరుతో మాడుగుల వెళ్లారు. ఆయనతో పాటు గవిరెడ్డి, పివిజి.కుమార్ ఉండగా, పైలా రాలేదు. శుక్రవారం పైలా నామినేషన్ వేసి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. పైలా స్థానంలో బండారుకు టికెట్ ఇవ్వడాన్ని పైలా అనుచరులు తట్టుకోలేకపోతున్నారు. మాడుగుల టికెట్‌ను దృష్టిలో పెట్టుకొని టిడిపి మహానాడులో కోటి రూపాయలు విరాళ చెక్‌ను చంద్రబాబుకు పైలా అందజేశారు. పార్టీని నమ్ముకొని పనిచేసిన ఆయనకు చివరకు అవమానం తప్పలేదు.

వాల్తేర్ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

ఏప్రిల్ 28 మే 9 వరకు రద్దు చేశారు

18107 రూర్కెలా - జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 27 నుండి మే 7 వరకు రాయగడ వద్ద షార్ట్ టర్మినేట్ చేశారు. దీంతో 18108 జగదల్‌పూర్-రూర్కెలా ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 28 నుండి మే 8 వరకు జగ్దల్‌పూర్‌కు బదులుగా రాయగడ నుండి బయలుదేరుతుంది. అదేవిధంగా 18005 హౌరా - జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుండి మే 6వరకు టిట్లాగఢ్‌లో టర్మినేట్ చేశారు. దీంతో 18006 జగదల్‌పూర్ -హౌరా ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 28 నుండి మే 08 వరకు జగదల్‌పూర్‌కు బదులుగా టిట్లాగఢ్ నుండి బయలుదేరుతుంది.18006 జగ్దల్‌పూర్-హౌరా సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 20న టిట్లాగఢ్‌లో ఒక గంట ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం మెరైన్ బిపిసిఎల్ పెట్రోల్ బంక్ వద్ద వినియోగదారులు, బంక్ సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక దళ వారోత్సవాల్లో భాగంగా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బంక్ యాజమాన్యం మాట్లాడుతూ, తరచూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా అగ్ని ప్రమాదాలకు ఆస్కారముండదన్నారు. ఫైర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెయిందొర పేట, పెద్ద జాలరి పేటల్లో వాల్‌పోస్టర్లు అతికించి, ప్రజలకు కరపత్రాలను పంచుతూ అగ్నిప్రమాదాల నివారణపై వివరించినట్లు ఎడిఎఫ్ఒ పి.సింహాచలం తెలిపారు.

చిన్నారుల ఆటవిడుపునకు వేసవి శిబిరాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: వేసవిలో చిన్నారులకు ఆటవిడుపుతోపాటు విజ్ఞానం, వినోదం అందించాలనే లక్ష్యంతో బాలల వేసవి శిబిరాలు (సమ్మర్ క్యాంప్)-2024 ఈ నెల 25 నుంచి వచ్చేనెల 10 వరకు పదిరోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విశాఖపట్నం, అల్లూరి జిల్లాలకు సంబంధించి సమ్మర్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరించారు. క్యాంపు నిర్వహణకు అవసరమైన బుక్స్, స్పోర్ట్స్ కిట్స్‌ను ఆసరా ఛారిటబుల్ సొసైటీ (ఎసిఎస్), గౌతు లచ్చన్న ఆర్గనైజేషన్ ఫర్ వీకర్‌సెక్షన్స్ (గ్లో) సంస్థలు పంపిణీ చేశాయి. విశాఖపట్నం జిల్లాలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి), అల్లూరి జిల్లాలో గిరి బాల నేస్తం (జిబిఎన్) సంస్థలు ఈ సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తారు.

ఆసరా ఛారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ సి.సునీత మాట్లాడుతూ, బాలలలో క్రీడలను ప్రోత్సహించడం, పఠనాభిమానాన్ని పెంచడం ద్వారా వారిలో విలువలను పెంచడమే లక్ష్యంగా ఈ క్యాంప్‌లను నిర్వహిస్తామన్నారు. గ్లో సంస్థ ప్రతినిధి వెంకటగిరి మాట్లాడుతూ పిల్లలను వేధిస్తున్న ఒంటరితనం సమస్య నుంచి విముక్తి కల్పించి, నలుగురితో కలిసిమెలిసి ఉండడం, మంచిచెడులను తెలుసుకునే అవకాశాన్ని ఈ క్యాంపుల్లో నేర్పిస్తామన్నారు. విశాఖ జిల్లాలో 125చోట్ల, అల్లూరిలో 40చోట్ల మొత్తంగా 165 కేంద్రాలలో క్యాంపుల నిర్వహణకు అవసరమైన కిట్స్ పంపిణీ చేశామన్నారు.

విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ, బాలల సమగ్రాభివృద్ధికి ఈ రెండు సంస్థలతోపాటు మరికొంతమది వ్యక్తుల సహాయ సహకారాలు దోహదపడ తాయన్నారు. పిల్లలు కలవడమే ఒక చైతన్యమైతే, వారు అలా కలుసుకొని మాట్లాడడం, ఆటలాడడం, బొమ్మలు వేయడం, పుస్తకం చదవడం, కథలు చెప్పడం, ఇంటి పనులు చేయడం, పాటలు, డాన్స్ ఇలా ఎన్నో వారికి నచ్చిన అంశాలతో క్యాంపు నిర్వహిస్తామన్నారు.

కార్యక్రమంలో భీమిలి, మధురవాడ, ఆరిలోవ, మద్దిలపాలెం, జగదాంబ, కంచరపాలెం, గాజువాక, స్టీల్, గోపాలపట్నం జోన్‌ల కన్వీనర్లు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

భూకబ్జాలపైనే విజయసాయి దృష్టి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విజయసాయిరెడ్డి ఎక్కడున్నా అతని దృష్టంతా విశాఖలో భూకబ్జాలపైనే ఉంటుందని టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి ఆరోపించారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రిషికొండ, హయగ్రీవ, ఎన్‌సిసి, కార్తీక్ వనం, బే పార్కులు సొంతం చేసుకున్న వైసిపి బృందం కన్ను ఇపుడు వాల్తేర్ క్లబ్‌పై పడిందని, ఇప్పటికే క్లబ్ నిర్వాహకులకు బెదిరింపులు వెళ్లాయన్నారు. నెల్లూరు ఎంపీగా పోటీకి అక్కడికి వెళ్లినా, అక్కడ సైతం విశాఖ భూముల గురించే విజయసాయి మాట్లాడడం శోచనీయమన్నారు. విజయసాయి రెడ్డి, వైవి సుబ్బారెడ్డిలకు తోడు ఇపుడు బొత్స సత్యనారాయణ, వారిమద్దతుదారు ఎంపి ఎంవివి సత్యనారాయణ విశాఖలో భూదోపిడీయే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అతి పెద్ద టిడిఆర్ కుంభకోణం విశాఖలోనే జరిగిందన్నారు వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తే, సేల్ ఫర్ విశాఖ అని బోర్డ్ పెట్టేస్తారని తీవ్రంగా ఆరోపించారు. సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమర శెట్టి శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షులు వలిశెట్టి తాతాజీ, లీగల్ సెల్ అధ్యక్షులు బత్తి రాజశేఖర్ ఉన్నారు.

కరకచెట్టు పోలమాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : కరకచెట్టు పోలమాంబ వార్షిక జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇఒ కె.గాయత్రి తెలిపారు. గురువారం పెదవాల్తేరు పోలమాంబ ఆలయ ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ, వచ్చేనెల 5 వరకు నిర్వహించే జాతరలో 22న తొలేళ్ల ఉత్సవం, 23న ప్రధాన పండగ అనుపోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎనిమిది మొబైల్ టాయిలెట్స్, 16 సిసి కెమెరాల నిఘాతో భద్రత చేశామన్నారు.

19వ వార్డులో ఎంవివి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్మోహనరెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని వైసిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ అన్నారు. గురువారం 92వరోజు పెదజాలరిపేట నుంచి వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరాడ వెంకటలక్ష్మి దాస్‌తో కలిసి పాదయాత్ర కొనసాగించారు. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు కార్యక్రమంలో వాడమోదుల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అదానీ గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, ,విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కోకింగ్ కోల్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, అదాని గంగవరం పోర్ట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక చట్టాలేవీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. గంగవరం, దిబ్బపాలెం గ్రామాల నిర్వాసిత కార్మికుల సమస్యలపై కలెక్టర్ సమక్షంలో కుదిరిన ఒప్పందాన్ని ఫోర్టు యాజమాన్యం తుంగలో తొక్కేయడంతో మళ్లీ ఆందోళన చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.విశాఖ స్టీల్‌ప్లాంట్ వెనకాలే ఉన్న గంగవరం పోర్టు వల్ల సరుకు రవాణా చార్జీలు తగ్గుతాయని భావిస్తే, విశాఖ పోర్టుకు చెల్లించిన చార్జీలే చెల్లించాలని ఒత్తిడి తెచ్చి ప్రభుత్వ పెద్దలతో ఒప్పందం చేయించుకుందని, ఇపుడు కార్గోహ్యాండ్లింగ్ ఛార్జీల బకాయి పేరుతో స్టీల్‌ప్లాంట్‌కు సరుకులు సరఫరా నిలిపేసిందన్నారు.కీలకరంగాలు ప్రైవేటు సంస్థల చేతుల్లో ఉండే జరిగే అనర్థాలకు ఇది నిదర్శనమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని కోకో ఒవేన్ బ్యాటరీలకు కుకింగ్ కోల్ సరఫరా తగ్గితే ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్ విషవాయువు వెలువడి ఎల్‌జి పాలిమర్స్ దుర్ఘటన పునరావృతమయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కోకింగ్ కోల్ సరఫరాకు సెయిల్ యాజమాన్యం ముందుకు రావడంపై అభినందించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె. అచ్యుతరావు, ఉపాధ్యక్షులు కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి తీర్థం పుచ్చుకున్న అక్కరమాని

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎ మాజీ చైర్‌పర్సన్, భీమిలి మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్, వైసిపి తూర్పు మాజీ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల, వెంకటరావు గురువారం తెలుగుదేశం పార్టీలో చేశారు. ఉండవల్లిలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. అధినేత చంద్రబాబు వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపిపి గోపి రాజు, ఇతర అనుచరులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్ గార్డులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆర్‌కె బీచ్‌లో అలల తాకిడికి మునిగిపోతున్న యువకుడిని జివిఎంసి లైఫ్‌గార్డులు రక్షించారు. కోల్‌కతాకు చెందిన కుశాల్ అనే యువకుడు తన స్నేహితులతో కలిసి ఆర్‌కె. బీచ్‌లో స్నానం చేస్తుండగా, అలల్లో చిక్కుకుపోయాడు. దీన్ని గమనించిన జివిఎంసి లైఫ్‌గార్డులు ఎం.నవీన్, కెపిఎస్ .శ్రీనివాస్, జె.హర్షిత్, టి.కల్యాణ్ వెంటనే అప్రమత్తమై ప్రాణాలను కాపాడారు.

IN THE HON'BLE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
A.S.No.442 / 2019

Between:
M/s. A.R.K.Infra Avenues India Pvt. Ltd., formerly Sri.Sai Srinivasa Enterprises Pvt. Ltd., represented by its Managing Director Penumatsa Rama Subramanyam Raju & others.
... Appellants
And:
Satyam Satyavathi Gowtham & others
... Respondents

NOTICE

To,
Respondent No. 15:
Sri Krishna Co Opertaive House Building Society ltd. Rep., By its Secretary, D.No.9-1-153/A, New Resapuvaniplaem Visakhapatnam.
Respondent No. 16:
Gandi Ashok, S/o. Bangarayya, Hindu, Resident of Plot No. MIG. 112, D.No.4-48-2/4, Lawsonsbay Colony, Visakhapatnam.

Please take notice that the above named Appellant herein has filed the above Appeal against the Decree and Judgement in passed by the Hon'ble Court of the IV Additonal Senior Civil Judge, Visakhapatnam in O.S.No.443/2004 dated 28-06-2019 and the appeal stands posted to **07-05-2024** for your appearance you are hereby required to appear before the Hon'ble Court either inperson or through duly instructed Advocate on **07-05-2024 at 10.30 A.M** to answer all material questions failing which the matter will be heard and determined in your absence, ex-parte as per law

(By Order of the Hon'ble Court)
K.V.RAMANA
Advocte, D.No. 1-3-130/2,
Akkireddypalem, Visakhapatnam.
Cell No. 92488 09471.

IN THE HON'BLE COURT OF THE JUDGE: ADDL. FAMILY COURT AT: VISAKHAPATNAM
F.C.O.P.2025/2023

Between:
Vakada Santhosh ...Petitioner
And:
1) Smt. Vakada (Bodiredla) Moulika
2) Bathina Devi Soma Sekhar
...Respondents

NOTICE

To,
R-2:Bathina Devi Soma Sekhar,
S/o. Venkata Ramana,
Hindu, aged about 30 years,
R/at D.No.29-19-18/1,
Gollalapalem,
Visakhapatnam.

Please take notice that the above FCOP.2025/2023 filed by the petitioner against the respondents and the matter stands posted to **25-04-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **25-04-2024**at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
E. RAVI KHANNA,
Advocate
Visakhapatnam,
Cell: 9246673785.

ఆలయాల ముసుగులో ఆక్రమణలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆలయాల పేరుతో జివిఎంసి స్థలాన్ని ఆక్రమించి కంటైనర్లతో ఆలయాలను ఏర్పాటుచేసేశారు. జివిఎంసి, ఎండోమెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వెంటనే స్పందించి వీటిని తొలగించారు. ఈ ఘటన 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు సమీపం జివిఎంసి కళ్యాణ మండపం, క్రిస్టియన్ కల్యాణ మండపం, ముస్లిముల మసీదు పక్కన ఉన్న జివిఎంసి ఖాళీ స్థలాన్ని దర్జాగా కబ్జా చేస్తున్నారు. జగన్నాథ ఆలయం, కన్యాకాపరమేశ్వర ఆలయాల కోసం ఇనుప గజాలతో రెడీమెడ్‌గా తయారుచేసిన ఆలయాలు, ముస్లిముల ప్రార్థన కోసం చదును చేసిన స్థలంలో ఇనుప రాడ్డుతో తయారు చేసిన జెండా రాడ్డును ఏర్పాటు చేశారు. కన్యాకాపరమేశ్వర ఆలయం, జగన్నాథ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ట చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న జివిఎంసి టౌన్‌ప్లానింగ్ ఎసిపి శాస్త్రి, టిపిఒ వరప్రసాదు ఆధ్వర్యాన ఎండోమెంట్ సిబ్బంది వచ్చి ముస్లిములు ఏర్పాటు చేసిన జెండా రాడ్డును, రెడీమేడ్‌గా తయారు చేసి ఆలయాల కంటైనర్లను గ్యాస్ కట్టర్‌లతో తొలగించారు. దీంతో నిర్వాహకులకు, జివిఎంసి సిబ్బంది మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. ఆలయాల ఏర్పాటు కోసం స్థలాన్ని చదును చేసే క్రమంలో జివిఎంసి స్థలాన్ని ఆనుకొని ఉన్న అటవీ ట్రంచ్‌ను కూడా కప్పేశారు.

రాజకీయ నాయకుల హామీతోనే...

రాజకీయ నాయకుల హామీలతోనే ఈ ఆలయాలను ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయా మతస్తులు, కులస్తుల ఓట్లు రాబట్టుకోవడం కోసం కొంత మంది రాజకీయనాయకులు, స్థానిక నాయకుల ప్రోద్బలంతోనే జివిఎంసి స్థలాన్ని దర్జాగా ఆక్రమించేసి, అటవీ జంతువులు జనావాసాల మధ్యకు రాకుండా అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రంచ్‌ను కూడా కప్పేసి మరి ఆలయాలను ఏర్పాటు చేసినట్టు స్థానికులు విమర్శిస్తున్నారు.

తొలగించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

కంటైనర్ ఆలయాలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్, ఎండోమెంట్ సిబ్బంది

నేరాలు ఘోరాలు

ఆగివున్న లారీని ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అనకాపల్లి-ఆనందపురం 16వ నెంబర్ జాతీయ రహదారిలో ఇరువాడ సమీపంలోని పార్కింగ్ స్థలంలో ఆగివున్న లారీని బుధవారం రాత్రి మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం చెందారు. పోలీసులు కథనం ప్రకారం... కాకినాడ రూరల్ ఇందిరపాలెం గ్రామానికి చెందిన మసుమెను శ్రీనివాసరావు (44) కాకినాడ నుండి భువనేశ్వర్ పామాయిల్ లోడుతో వెళ్తున్నాడు. ఇరువాడ దరి పార్కింగ్ స్థలంలో సిగ్నల్ లైట్స్‌గాని ,సేఫ్టీ ఇండికేటర్స్ గాని లేకుండా ఆగి ఉన్న లారీని వెనుక నుండి శ్రీనివాసరావు లారీ ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు లారీ కేబిన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే శ్రీనివాసరావును బయటకు తీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానిక సీఐ పిన్నింటి రమణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చెప్పారు.

మద్యం, నాటుసారా అమ్ముతున్న వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని గున్నెంపూడి, కేపీ అగ్రహారం, తురకలపూడి, చిన్నప్పన్నపాలెం, పెద్దమదిన, కోమల్లపూడి తదితర గ్రామాల్లో అక్రమంగా మద్యం, నాటు సారా అమ్ముతున్న వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో సిఐ అప్పలనాయుడు, సర్కిల పరిధిలో పలువురు ఎస్ఐలు పాల్గొన్నట్లు వెల్లడించారు.

గొట్టిపల్లిలో లో-వోల్టేజీ

ప్రజాశక్తి-ఆనందపురం : వేసవి ఉష్ణతాపానికి ప్రజలు ఒకవైపు అల్లాడుతుంటే.. మరోవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సరిపోక ఎప్పటికప్పుడు సరఫరా నిలిచిపోతుండటంతో గొట్టిపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొట్టిపల్లి పాత వాటర్ ట్యాంక్ సమీపంలోని విద్యుత్ వినియోగదారులకు ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సరిపడక లో-వోల్టేజీ సమస్య రావడంతో ఫ్యాన్లు, లైట్లు, ఫ్రిజ్, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు ఎప్పటికప్పుడు కాలిపోతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ కూడా సరిపడకపోవడంతో ఎప్పటికప్పుడు కరెంటు సరఫరా నిలిచిపోతుండడంతో వినియోగదారుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉంటుందని, సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎంటో నాక్స్ ద్వారా సుఖ ప్రసవం

ప్రజాశక్తి -తగరపువలస :నొప్పి లేకుండా సుఖ ప్రసవం పొందేందుకు వినియోగించే ఎంటో నాక్స్ పరికరాన్ని సంగివలస ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన అనిల్ నీరు కొండ ఆసుపత్రి, ప్రసూతి విభాగంలో గురువారం ఆసుపత్రి డీన్ డాక్టర్ పివి.సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అధునాతన పరికరం ద్వారా సీజేరియన్ ఆపరేషన్ల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఉమ, చైతన్య తదితరులు పాల్గొన్నారు

25న ఎపిఆర్ఎస్‌సిఎటి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎపి గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు ఈ నెల 25న 5, 6, 7, 8 తరగతులకు ఎపిఆర్ఎస్‌సిఎటి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కళాశాలలకు ఎపిఆర్‌జెసి, డిసి, సిఇటి -2024 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి హాల్ టిక్కెట్లను https: aprs.apcfss.in వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. హాల్ టిక్కెట్లు పోస్ట్ ద్వారా పంపించడం జరగదని తెలిపారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో పరీక్షాకేంద్రానికి గంట ముందు చేరుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా కెకె.రాజు ప్రచారం

53వ వార్డులో ప్రచారం చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. స్థానికులను పలకరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. జివిఎంసి 53వ వార్డు పరిధి జాకిర్ హుస్సేన్‌నగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ బర్కత్ ఆలితో కలిసి గురువారం మార్నింగ్‌వాక్‌లో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా జాకీర్ హుస్సేన్ నగర్‌లో నిషాని వద్ద ప్రార్థనలు నిర్వహించారు. కొంతసేపు స్థానిక ముస్లిం పెద్దలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి అండగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, షేక్ బాబ్జి, హనుమంత్, రామలక్ష్మి, వల్లి తదితరులు పాల్గొన్నారు.

నేడు నామినేషన్

ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా కెకె.రాజు శుక్రవారం నామినేషన్ వేస్తున్నట్లు పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉదయం 8 గంటలకు ఎన్జీజీవోస్ కాలనీలోని వైభవ వెంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం బైక్ ర్యాలీగా బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని పార్టీ కార్యాలయానికి 9 గంటలకు చేరుకొని, అక్కడి నుంచి పాదయాత్రగా సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

శాటిలైట్ టౌన్‌షిప్‌గా భీమిలి అభివృద్ధి : గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలిని శాటిలైట్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేయనున్నట్లు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు చెప్పారు. టిడిపి విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం శ్రీభరత్‌తో కలిసి స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తనను ఎమ్మెల్యేగా, శ్రీభరత్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఆరో దఫా ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, 2014 లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి 37 వేల భారీ మెజారిటీతో విజయం సాధించానని చెప్పారు. జిల్లాలోనే అతి పెద్ద నియోజకవర్గమైన భీమిలికి సంబంధించి త్వరలో మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్టు తెలిపారు. నాలుగున్నరేళ్లుగా టిడిపి అభివద్ధికి విశేష కషి చేసిన కోరాడ రాజబాబు, జనసేన నియోజక వర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్ తన విజయం కోసం కృషిచేస్తున్నారని చెబుతూ, వారికి అభినందనలు తెలిపారు.

విశాఖ లోక్‌సభ టిడిపి అభ్యర్థి ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, అన్ని తరగతుల ప్రజలు వైసిపి పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ పాత ఆర్‌టిఒ ఆఫీస్ రోడ్డులోని సాయిరాం ఇండస్ట్రీలో గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్ శేషగిరిరావు, ఐలా సెక్రటరీ చీకటి సత్యనారాయణ, వాసవ అధ్యక్షులు పాండురంగ ప్రసాద్ రావు, ఎస్పీ బయిలింగ్ ప్రెస్ చైర్మన్ సుమన్, శ్రీ కన్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఎ డైరెక్టర్ ప్రభాకరరావు, వివిధ పరిశ్రమ యజమానులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శేషగిరిరావు, సత్యనారాయణ తదితరులు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ సబ్‌స్టేషన్ పరిధి 11 కెవి వుడా కాలనీ, 11కెవి హిల్ -1 ఫీడర్‌పై శుక్రవారం మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జోన్ 3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. పోర్టు కాలనీ, ఎన్జీవో కాలనీ, సుద్ద గెడ్డ ఏరియా, వాంబే కాలనీ, శ్రీనివాస్ నగర్, అయోధ్య నగర్, ఆర్‌టిసి కాలనీ, మానం ఆంజనేయల కాలనీ, సాక్షి పేపర్ కార్యాలయం ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న గుంటూరు వెంకట నరసింహమూర్తి

నేడు గుంటూరు వెంకట నరసింహమూర్తి నామినేషన్

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా గుంటూరు వెంకట నరసింహమూర్తి శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు అందరూ శుక్రవారం ఉదయం 11 గంటలకు తహశీల్దార కార్యాలయం వద్దకు చేరుకోవాలని కోరారు. 'సేవ చేసే నాయకుడు మీ వెంట ఉంటాడని, అందరూ మీ యొక్క అభిమానాన్ని చూపించాలని' ఆయన కోరారు

92వ వార్డులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి- గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి అజంతపార్కు కాలనీ, టైలర్స్ కాలనీ, పద్మనాభనగర్ ప్రాంతాల్లో పశ్చిమ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝూన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు, కన్వీనర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

89వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి సంతోషినగర్, కొత్తపాలెంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ఎమ్మెల్యేగా తనను, విశాఖపట్నం ఎంపీగా ఎం.శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమములో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం స్ప్రింట్ ఎక్సపోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది గురువారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాలు జరిగితే ఏ రకంగా నివారించాలో డెమో ద్వారా అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
శుక్రవారం
19 ఏప్రిల్ 2024

కలం మాట



ప్రజాస్వామ్యానికే ఓటు..!



ఓట్ల పండగ వచ్చేసింది
ప్రపంచంలో అతి పెద్ద ఎన్నికలు
మనదో గొప్ప ప్రజాస్వామ్యం
ఇక్కడో ప్రశ్న?
ఓటేస్తే ప్రజాస్వామ్యమా
ప్రజాస్వామ్యానికి ఓటేయడమా?

నీ ఓటుతో గెలిచినోడు
నీ నోరు నొక్కేస్తున్నడు
నువ్వెనుకున్న
రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేస్తున్నడు
గవర్నర్లతో నాటకాలాడుతున్నడు

నీ సొమ్ముతో నిర్మించిన
ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తున్నడు
సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నడు
ఉపాధి గల్లంతు చేస్తున్నడు
విద్య, వైద్యం ప్రియం చేస్తున్నడు
ధరలు పెంచేస్తున్నడు
రాజ్యాంగ హక్కులు కాజేస్తున్నడు
విద్వేషాలు రాజేస్తున్నడు
నీ జీవితం దుర్భరం చేస్తున్నడు
ఇదేనా ప్రజాస్వామ్యం
దీనికేనా నువ్వోటేసేది?

కార్పొరేట్ల నుండి కోట్లు దండుకుని
ఆ డబ్బుతో నీ ఓటును కొంటున్నడు
కులం, మతం మత్తులో ముంచుతున్నడు
దేముడ్ని రాజకీయం చేస్తున్నడు
ఇదేనా ప్రజాస్వామ్యం
దీనికేనా నువ్వోటేసేది?

ఓటేస్తేనే ప్రజాస్వామ్యం కాదు
రాజ్యాంగాన్ని కాపాడితేనే ప్రజాస్వామ్యం
నువ్వే కాపలాదారువి
ఇప్పుడు చెప్పు
నీ ఓటెవరికి
ప్రజాస్వామ్యానికే కదా!

- ఎ.అజశర్మ
మొబైల్ : 94900 98790

ప్రజాస్వామ్యం అనేది
స్వామ్యవాదానికి
రహదారి
- కార్ల్ మార్క్స్



నామినేషన్ల కోలాహలం

• అనుచరగణంతో భారీ ర్యాలీలు నిర్వహిస్తూ అభ్యర్థులు నామపత్రాల దాఖలు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నామినేషన్ల పర్వం మొదలైంది. తొలిరోజు గురువారం సందడి వాతావరణంలో అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అనుచరగణంతో భారీ ర్యాలీలు చేపట్టారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

భీమునిపట్నం : స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావు గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డికి నామినేషన్ పత్రం అందజేశారు. గంటా అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ టిడిపి రూరల్ మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నరసింహరాజు నామినేషన్ పత్రం దాఖలు చేశారు. గంటా కుమారుడు రవి తేజ మధ్యాహ్నం నామినేషన్ పత్రం దాఖలు చేశారు. ఇతని అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ టిడిపి నేతలు మొల్లి లక్ష్మణరావు మరో నామినేషన్ పత్రం దాఖలు చేశారు.

అట్టహాసంగా గంటా నామినేషన్ దాఖలు

భీమిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గురువారం అట్టహాసంగా నామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా ప్రభుత్వాసుపత్రి వరకు చేరింది. ర్యాలీగా వచ్చిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆర్‌డిఒ కార్యాలయానికి వంద కిలోమీటర్ల దూరంలో ఉండిపోయారు. గంటా శ్రీనివాసరావు వాహనంతో పాటు మరో రెండు వాహనాలు మాత్రమే కార్యాలయం వరకు వెళ్లాయి. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో నామినేషన్ పత్రం దాఖలు చేశారు. దారి పొడవునా ప్రచార రథంపై నుంచి గంటా ప్రజలకు అభివాదం చేస్తూ, నమస్కరిస్తూ, విజయ కేతనం చూపిస్తూ వచ్చారు. వేలాది మంది కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భీమిలిలో సందడి వాతావరణం నెలకొంది. నాలుగు గుర్రాలపై యువకులు టిడిపి జెండాలతో చేసిన హడావిడి అందరినీ ఆకట్టుకుంది. తీన్ మార్, డప్పుల మోత, పులివేషాలు, కేరళ మేళా, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పద్మనాభం : పద్మనాభం మండలంలోని పలు గ్రామాల నుంచి టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు గంటా శ్రీనివాసరావు నామినేషన్‌కు తరలివెళ్లారు. ఆటోలు, బైక్‌లపై రేవిడి పెట్రోల్ బంక్ వద్దకు చేరుకొని అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లారు.

కలెక్టర్ మల్లికార్జునకు నామినేషన్ పత్రం అందజేస్తున్న కె.ఎ.పాల్

గాజువాక, పెందుర్తిల్లో ఇలా..

గాజువాక : గాజువాక నియోజవర్గ పరిధిలో తొలి రోజు గురువారం రెండు నామినేషన్లు వేశారు. పిరమిడ్ పార్టీ నుంచి పి.సత్యనారాయణమూర్తి, జాతీయ జనసేన పార్టీ నుంచి పల్లి శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి పురుషోత్తంరెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేశారు.

యలమంచిలి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సుందరపు

పోలీసుల ఆంక్షలు.. పటిష్ట భద్రత

యలమంచిలి : నామినేషన్ల ప్రక్రియకు ఎలమంచిలిలో పరవాడ డిఎస్‌పి సత్యనారాయణ, సి.ఐ. గఫూర్ గస్తీని పర్యవేక్షణలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. దిమిలి రోడ్డులో వాహన రాకపోకలపై ఆంక్షలు విధించి, బైపాస్‌లో జాతీయ రహదారికి ట్రాఫిక్‌ను మళ్లించారు. నామినేషన్ కేంద్రానికి వంద అడుగుల దూరంలో నియంత్రించి, కేవలం ఐదుగురినే అనుమతించారు. పాస్‌లు లేవని జర్నలిస్టులను అనుమతించలేదు. అటు ప్రభుత్వ ఆసుపత్రి, ఇటు బస్‌కాంప్లెక్స్ ఇలా ఎక్కడికక్కడ బారికేడ్లు నిర్మించారు.

నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న గంటా శ్రీనివాసరావు

పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గంలో బహుజన సమాజవాది పార్టీ నుంచి బంగారి రమణ నామినేషన్ వేసినట్లు ఆర్‌ఒ శేష శైలజ తెలిపారు.

సుందరపు నామినేషన్ షురూ....

పాల్గొన్న కూటమి ఎంపి అభ్యర్థి సిఎం.రమేష్, పప్పల, ప్రగడ

యలమంచిలి/ అచ్యుతాపురం : కూటమి తరపున ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా జనసేనకు చెందిన సుందరపు విజయకుమార్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కూటమి నాయకులు బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్. పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావులతో కలిసి వెళ్లి రిటర్నింగ్ అధికారి అనుపమకు నామినేషన్ పత్రాలను అందించారు.

భారీ ర్యాలీగా వెళ్లి....

నామినేషన్ దాఖలుకు కార్లు, బైక్‌లు, ఆటోల్లో కూటమి శ్రేణులతో భారీ ర్యాలీగా రాంబిల్లి మండలం వెంకటాపురం కార్యాలయం నుంచి బయల్దేరిన సుందరపు, మార్గమధ్యలో కొత్తూరు వద్ద తమ ఇలవేల్పు గుమ్మడి అమ్మ వారికి ప్రతేక పూజలు నిర్వహించారు. అనంతరం యలమంచిలి తహశీల్దార్ కార్యాయాలనికి వెళ్లి నామినేషన్ వేశారు. కార్యక్రమంలో బుద్ధ నాగజగదీశ్, సుందరపు సతీశ్, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, దిన్‌బాబు, విజయబాబు, కాట్రకోట చిరంజీవి, అన్నం వెంకటరావు, గొంతిన నాగేశ్వరరావు, బొద్దపు శ్రీను, బైలపూడి, పప్పు ఈశ్వరరావు, లవుడు లోవరాజు, నాలుగు మండలాలకు చెందిన మూడు పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్ద భారీ క్యూ

యలమంచిలి : నామినేషన్ వేసేందుకు పార్టీ అభ్యర్థి అటు ఇలా వెళ్లారో లేదో, చాలా మంది కార్యకర్తలు మద్యం దుకాణానికి ఎగబడ్డారు. పార్టీ టోపీలు, కండువాలు, జెండాలతో ఉన్నామన్న విషయాన్ని కూడా మరిచిపోయి, వాటితోనే మద్యం దుకాణం వద్ద క్యూ కట్టారు. ఒకరికి ఒక్క మద్యం బాటిల్‌ను మాత్రమే విక్రయించాలన్న నిబంధనతో మందుబాబులంతా క్యూ కట్టారు.

‘ఆడారి’ ఆత్మీయ సమావేశం

ఆత్మీయ సమావేశంలో కేకు కట్ చేస్తున్న ఆనందకుమార్, పివి సురేష్

ప్రజాశక్తి -ములగాడ : సార్వత్రిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ కోరారు. పారిశ్రామిక ప్రాంత పరిధి కొత్త నక్కవానిపాలెంలోని వైసిపి కార్యాలయంలో 60 వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, వార్డు అధ్యక్షులు ఆడారి హరీష్, ఇన్‌ఛార్జి జిఎల్‌వి.నరేష్ ఆధ్వర్యాన ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారం అహర్నిశలు కృషి చేస్తున్న నేతలు, కార్యకర్తలను మరిచిపోనని చెప్పారు. పదవి లేకుండానే చాలా సమస్యలను పరిష్కరించానని, ఎమ్మెల్యేగా ఉంటే మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు గురించి గుర్తుచేస్తూ ఓటును అభ్యర్థించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కో-అబ్జర్వర్ పీలా ఉమారాణి, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రికార్డుల్లో మేటి..తెన్నేటి.!

• తొలిసారి జిల్లాలో ఒకేసారి రెండు చోట్ల పోటీచేసిన ఘనత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

అసెంబ్లీ ఎన్నికల్లో ఒకేసారి రెండు నియోజకవర్గాల నుంచి తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన రికార్డును స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు ఉద్యమ నిర్మాత తెన్నేటి విశ్వనాథం దక్కించుకున్నారు. 1962లో జరిగిన ఎన్నికల్లో ఆయన విశాఖ - 1, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో విశాఖ -1లో ఓటమి పొందిన విశ్వనాథం, మాడుగులలో విజయం సాధించారు. అప్పటిలో విశాఖ -1లో ఇండిపెండెంట్ అభ్యర్థి తెన్నేటి విశ్వనాథంకు 17383 ఓట్లు లభించాయి. ప్రత్యర్థిగా కాంగ్రెస్‌కు చెందిన ఎవి.భానోజీరావు పోటీ చేయగా ఆయనకు 21,221 ఓట్లు లభించాయి. దీంతో 3838 ఓట్ల ఆధిక్యతతో భానోజీరావు విజయం సాధించారు. అయితే మాడుగుల నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేసిన తెన్నేటి విశ్వనాథానికి అక్కడ 74.28 శాతం ఓట్లు రావడం విశేషం. ఆయనకు 26,484 ఓట్లు లభించగా ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన దొండా శ్రీరామమూర్తికి 7878 ఓట్లు లభించాయి. 18,606 ఓట్ల తేడాతో విశ్వనాథం నెగ్గారు.

మరో రికార్డు

విశాఖ జిల్లా ఎన్నికల చరిత్రలో తెన్నేటి విశ్వనాథంకు మరొక రికార్డు ఉంది. ఆయన 1967లో విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి, విశాఖ - 1 అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. రెండు చోట్లా ఇండిపెండెంట్‌గా పోటీచేసి రెండు చోట్లా విజయం సాధించారు. అటు పార్లమెంట్, ఇటు అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికైన రికార్డు ఈ నాటికీ తెన్నేటి విశ్వనాథం పేరిట ఉంది. విశాఖ పార్లమెంట్ ఎన్నికల్లో తెన్నేటి విశ్వనాథానికి 1,36,766 ఓట్లు లభించగా, ప్రధాన ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి పి.వెంకటరావుకు 1,02,693 ఓట్లు దక్కాయి. దీంతో 34,073 ఓట్ల ఆధిక్యతతో తెన్నేటి విశ్వనాథం విజయం సాధించారు. అదే సందర్భంలో విశాఖ -1 అసెంబ్లీ స్థానానికి తెన్నేటి విశ్వనాథం ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. ఆయనకు 29,001 ఓట్లు రాగా, ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన ఎవి.భానోజీరావుకు 14,695 ఓట్లు లభించాయి. దీంతో తెన్నేటి విశ్వనాథం 14,306 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేసి పార్లమెంటు స్థానాన్ని ఉంచుకున్నారు. ఇది కూడా ఒక రికార్డే.

జోగవానిపాలెంలో
సిపిఎం ఎన్నికల ప్రచారం

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 67వ వార్డు పరిధి జోగవానిపాలెంలో ఇండియా ఫోరం బలపర్చిన సిపిఎం గాజువాక నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడుకు మద్దతుగా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లోనూ, కొండ కింద ప్రాంతాల్లోనూ ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, జగ్గునాయుడును గెలిపించాలని కోరారు. గాజువాక హౌస్ కమిటీ సమస్యపై సిపిఎం అనేక పాదయాత్రలు, పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సిపిఎం పోరాట ఫలితంగానే హౌస్ కమిటీకి సంబంధించి జిఒ 7ను అప్పటి టిడిపి ప్రభుత్వం వెనక్కి తీసుకుందని వివరించారు. ఈ ప్రచారంలో సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.వెంకట్రావు, కె.కిరీటం, డాక్టర్ ఎం.రమేష్‌కుమార్, కె.సంతోషం, వి.ప్రభావతి, సూర్యకాంతం, కల్యాణి, ఎస్.విజయ, బివి.సత్యనారాయణ, మల్లికార్జున, సుబ్బారావు, నారాయణ, పాలూరు లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

శ్రీనగర్‌లో ఎస్‌వికె.పరుశురాం ఆధ్వర్యాన ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి సిపిఎం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

నగరంలో ఇండిపెండెంట్ల సత్తా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ పార్టీల తిరుగుబాటు అభ్యర్థులైతే తప్ప ఇండిపెండెంట్ (స్వతంత్ర్య) అభ్యర్థులంటే అంతా తేలిగ్గా తీసి పారేస్తుంటారు. కానీ... విశాఖ నగరంలో ముగ్గురు ఇండిపెండెంట్లు గతంలో అసెంబ్లీలో అడుగు పెట్టారు.

- ప్రస్తుతం విశాఖ ఉత్తరంగా ఉన్న విశాఖ -2 నుంచి 1972లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన పోతిన సన్యాసిరావు తన సమీప ప్రత్యర్థి ద్రోణంరాజు సత్యనారాయణపై గెలుపొందారు. సన్యాసిరావుకు 17356 ఓట్లు లభించగా, సత్యనారాయణకు 15879 ఓట్లు వచ్చాయి. 1477 ఓట్ల ఆధిక్యతతో సన్యాసిరావు గెలిచారు. ప్రత్యర్థి సత్యనారాయణ కూడా ఇండిపెండెంట్ అభ్యర్థే కావడం గమనార్హం.

-1952 ఎన్నికల్లో భీమునిపట్నం నియోజకవర్గం నుంచి కె.సూర్యనారాయణ (ఇండిపెండెంట్) తన సమీప ప్రత్యర్థి జెవికె.వల్లభరావుపై 987 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. సూర్యనారాయణకు 11194 ఓట్లు లభించగా, వల్లభరావుకు 10,207 ఓట్లు లభించాయి.

-1967 ఎన్నికల్లో విశాఖ - 1 నుంచి తెన్నేటి విశ్వనాథం (ఇండిపెండెంట్) నాటి కాంగ్రెస్ అభ్యర్థి ఎవి.భానోజీరావుపై గెలుపొందారు. తెన్నేటి విశ్వనాథంకు 29001 ఓట్లు లభించగా భానోజీ రావుకు 14715 ఓట్లు వచ్చాయి. ఇలా జిల్లా నుంచి స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల్లో సత్తా చాటారు.

మార్నింగ్ వాక్‌లో ఎన్నికల ప్రచారం

ఆర్‌కె బీచ్‌లో వాకర్స్‌తో మాట్లాడుతున్న బొత్స ఝాన్సీ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖ సమగ్రాభివృద్ధికి, బీచ్‌లో మార్నింగక్ వాకర్స్‌కు అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానని వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. గురువారం వేకువజామున ఆర్‌కె బీచ్‌లో మార్నింగ్ వాకర్స్‌ను ఆత్మీయంగా పలకరిస్తూ, చిరువ్యాపారులతో ముచ్చటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు వారికి అందాయా లేదాయని వాకబు చేశారు. ఉత్తరాంధ్ర పురోభివృద్ధికి, పాలనాపరంగా విశాఖకు తీర్చిదిద్దడానికి జగన్మోహనరెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు.

కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

జిఇఎమ్-2024పై బేస్‌లైన్ సర్వే

ప్రజాశక్తి- పరవాడ

ఎన్టీపీసీ సింహాద్రి బాలికా సాధికారత మిషన్-2024 (జిఇఎమ్ -2024)లో భాగంగా బెనెల్ట్ కోల్మన్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో గురువారం బేస్‌లైన్ సర్వే నిర్వహించారు. 120 మంది విద్యార్థులు పాల్గొన్న బేస్‌లైన్ సర్వే సింహాద్రిలోని బాల భారతి పబ్లిక్ స్కూల్‌లో జరిగింది. ఈ సర్వే రాబోయే 4-వారాల రెసిడెన్షియల్ వర్క్‌షాప్‌లో పాల్గొనే విద్యార్థుల విద్యా రంగం, అవసరాలను అర్థం చేసుకోవడంలో మొదటి దశను సూచిస్తుంది. బాలికల విద్యార్థులను ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, చొరవ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ శివం ప్రతాప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న మోడీ ప్రభుత్వం

ప్రజాశక్తి-దేవరాపల్లి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ భారతంలో కోట్లాది మందికి ఉపాధి కల్పించి వలసలను నివారిస్తున్న ఈ చట్టానికి మోడీ సర్కారు ప్రతి ఏటా బడ్జెట్ తగ్గిస్తుందని విమర్శించారు. 2020-2021 బడ్జెట్‌లో రూ.1,11,105 కోట్లు కేటాయిస్తే, 2023-24 బడ్జెట్లో కేవలం రూ.60వేలు కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. గ్రామీణ నిరుద్యోగం 7 శాతం కొనసాగుతున్న నేపథ్యంలో నిధులు, పనిదినాలు మరింత పెంచాల్సి ఉందగా, తగ్గించడం దారుణమన్నారు. పనివిధానాలను 200 రోజులకు పెంచాలని, రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా, ప్రభుత్వం నిధులు కోత పెట్టడం దుర్మార్గమన్నారు. బిటక్ ఇండియా అందించిన డేటా ప్రకారం గత 21 నెలలు సిష్టం నుంచి 7.6 కోట్ల జాబ్ కార్డులు తొలగించబడ్డాయని పేర్కొన్నారు. తక్షణమే నిధులు పెంచి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, కూలీలకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని తాళ్లపాలెం సెక్షన్, నరసింగబిల్లి, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్స్ పిఎమ్ఐ వర్క్ కారణంగా శుక్రవారం ఉదయం 6.30 నుండి 10.30 గంటల వరకు ఆ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు కశింకోట ఏపిఇపిడిసిఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగబిల్లి, ఎన్‌జి.పాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏఎస్.పేట, సోమవరం , కన్నూరుపాలెం, తీడ, చరకం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మోస్సిపేట, ఏనుగుతుని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సబ్బవరం : సబ్బవరం-1 సెక్షన్ పరిధిలోని 33/11కెవి సబ్బవరం సబ్ స్టేషన్ మైంటెనెన్స్ వర్క్ కారణంగా ఈ నెల 19న శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతాపురం, గొల్లలపాలెం, పైడివాడ, ఆసకాపల్లి, ఇరువాడ, పల్లవానిపాలెం, జగరపువానిపాలెం తదితర గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తురకలపూడి అధ్యక్షునిగా గంటల నరేష్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి జనసేన అధ్యక్షులుగా గంటల నరేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యత అప్పగించిన రాజుకి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబుకు మండల అధ్యక్షులు డిఎస్ నాయుడుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి- అనకాపల్లి

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు ఎన్.సంజయ్ గాంధీ, ఆశిష్ కుమార్ పాండే గురువారం కలెక్టరు కార్యాలయాన్ని సందర్శించారు. మొదట జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టిని కలసి తరువాత కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఉదయం 10 గంటలకు వ్యయ పరిశీలకులు సంజయ్ గాంధీ, 11 గంటలకు అనకాపల్లి, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఆశిష్ కుమార్ పాండ్య కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఇన్చార్జి, మత్స్యశాఖ ఎడి పి.ప్రసాద్ దీని గురించి వారికి వివరించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అందరికీ తెలియజేయడం, ఎన్నికలలో నిబంధనలను అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవడం కొరకు ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ పని చేస్తుందని చెప్పారు. దీనిలో కాల్ సెంటర్, కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, ఎక్స్ పెన్డీచర్ మానిటరింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వాహనాల పర్యవేక్షణ (జిపియస్ ట్రాకింగ్), వెబ్ క్యాస్టింగ్ మీడియా మోనటరింగ్, సోషల్ మీడియా మోనటరింగ్, కంప్లైంట్స్ మోనటిరింగ్, విభాగాలుంటాయని తెలిపారు. జిల్లాలో జరిగే ఎన్నికల ప్రక్రియ మొత్తం ఇక్కడి నుండే గమనించవచ్చని పేర్కొన్నారు. ఈ విభాగాలన్నింటికీ జిల్లా అధికారులు నేతృత్వం వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ శాఖలలో వున్న నిపుణులైన సిబ్బందిని ఎంపికచేసి నియమించడం జరిగిందన్నారు. గ్రీవెన్స్ కాల్ సెంటర్‌లో టోల్ ఫ్రీ నెంబర్ 1950, ల్యాండ్ లైన్ నెంబర్ 08924 226599కు వచ్చిన ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. కమ్యూనికేషన్ కంట్రోల్ రూమ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ విభాగం వీడియో వీవింగ్ టీమ్ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కోడ్‌ను గమనించి చర్యలకు సిఫార్సు చేస్తారని వివరించారు. జిపిఎస్ ట్రేసింగ్ ద్వారా వాహనాల గమనాన్ని పరిశీలించడం జరుగుతుందన్నారు. ఎంసిసి నోడల్ అధికారి జి.వి.లక్ష్మి మీడియా మోనటరింగ్ సింటర్‌లో పత్రికలు, టీవీ ఛానళ్లలో వచ్చే వార్తలు, ట్రోలింగులు, ఇతర సమాచారం ఈవిభాగంలో రికార్డు చేయడం జరుగుతుందని చెప్పారు. కోఆపరేటివ్ ఆడిట్ అధికారి సుబ్రమణ్యం పార్టీలు, అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించే విధానాన్ని తెలిపారు. వారి ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానాలివ్వగా పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

జనసేనలో పలువురు చేరిక



పరవాడ సర్పంచ్‌కు కండువా వేస్తున్న పంచకర్ల

ప్రజాశక్తి-పరవాడ

జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు గురువారం పరవాడ మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఇ.మర్రిపాలెంలో ప్రచారం చేపట్టారు. అనంతరం పరవాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, పెద్ద చెరువు ఆయకట్టుదారు అధ్యక్షుడు రెడ్డి శ్రీను, వార్డు మెంబర్లు, మహిళలు సుమారు 300 మందితో వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. అలాగే మండలంలోని గొర్లివాని పాలెం పంచాయతీ పరిధి దిబ్బల గొర్లివానిపాలెం, చింతల గొర్లివానిపాలెం గ్రామాలకు చెందిన వైసిపి, టిడిపి నాయకులు 200 మంది, జివిఎంసి 85వ వార్డు మంత్రి పాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకురాలు పచ్చికోరు వెంకట వరలక్ష్మి ఆధ్వర్యాన 50 మంది మహిళలు వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. వారికి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల జగన్నాధరావు, దుల్ల రామానాయుడు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, జనసేన మండల అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్ కాసులు, కన్నూరు వెంకటరమణ ఇతర నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : దోసూరు గ్రామం సర్పంచి నిర్మాణ సుజాత, ఉపసర్పంచ్ మలిరెడ్డి అచ్చమ్మ, వార్డు సభ్యులు అంగ శేఖర్, రావి లక్ష్మి, గండి రామునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు జాగారపు సత్తిబాబు తదితరులు బుధవారం రాత్రి జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అలాగే పూడిమడక గ్రామానికి చెందిన వైసిపి గ్రామ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ మెరుగు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తలు, ఉప్పరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ అడపా మహాలక్ష్మి నాయుడు తన అనుచరులు జనసేనలో చేరారు. వారందరికీ సుందరపు పార్టీ కండువాలు వేసి సాధారణంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

బీజేపీ, తెలుగుదేశం, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి బిఆర్టీ కాలనీ, తుమ్మపాల గ్రామాల్లో గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ ప్రజలు తమ విలువైన ఓటు హక్కును మంచి అభ్యర్థులకు వేయాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం, గంజాయి అమ్మకాలు చేసి ప్రజలను ముఖ్యంగా యువతను బానిసలుగా మార్చేశారని విమర్శించారు. ఎన్నికలంటే బంధుత్వాలు, మందుత్వాలు కాదన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్న కొణతాల రామకృష్ణను శాసనసభ పంపిస్తే ఈ ప్రాంతానికి మేలు జరుగుతుందని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కనుబుడ్డి నరసింగరావు, కొలసాని రమణ, పిల్లా హరి శ్రీనివాసరావు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంతలో హైపర్ ఆది ప్రచారం

కశింకోట : కశింకోట వారపు సంతలో జనసేన తరపున జబర్దస్త్ ఆర్టిస్టు హైపర్ ఆది గురువారం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను గెలిపించాలని కోరారు. ముందుగా అరిటి పళ్ళు అమ్ముతూ ఆకర్షించాడు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు బుదిరెడ్డి చిన్న తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న హైపర్ ఆది

బండారుకు మాడుగుల టికెట్‌పై సంబరాలు

ప్రజాశక్తి- సబ్బవరం

మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించినట్లు టీడీపీ అధిష్టానం బండారుకు సమాచారం ఇవ్వడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం బండారు సింహాచలం నరసింహ స్వామిని దర్శించుకొని మాడుగుల వెళ్తుండగా సబ్బవరంలో తెలుగు తమ్ముళ్లు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. సబ్బవరం దుర్గాలమ్మ అమ్మవారిని బండారు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ తను ఏ నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచిన పెందుర్తి నియోజకవర్గ ప్రజలను, నాయకులను మరిచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పల నాయుడు, నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి ముత్యాల నాయుడు, గండి దేముడు, కోటాన అప్పారావు, భరణికాన సాయినాధరావు, బుచ్చిరాజు, దాసరి వెంకటరమణ, అక్కిరెడ్డి దుర్గినాయుడు, రేసుగుడి రమణ, గవర అప్పారావు, ఆకులు గణేష్, గవర సత్యనారాయణ, పల్లా తాతారావు, ఎం అక్కు బాబు, పెద్దాడ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన పాల సంఘం మాజీ అధ్యక్షుడు

ప్రజాశక్తి -వడ్డాది : వైసీపీకి చెందిన విజయరామరాజుపేట పాల సంఘం మాజీ అధ్యక్షుడు మల్ల వెంకట్రావు తన అనుచరులతో కలిసి టీడీపీలో గురువారం చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఎంవీవీ సత్యనారాయణ, స్థానిక మాజీ సర్పంచ్ దొడ్డి కిషోర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

కశింకోట : కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామానికి చెందిన వైసిపి సచివాలయ కన్వీనర్ కోన వీరవెంకట సత్యనారాయణ, గ్రామ సచివాలయ కన్వీనర్ గొంతిన నూకేష్ గురువారం టిడిపిలో చేరారు. వీరు అనకాపల్లి లక్ష్మీనారాయణ నగర్‌లోని డివిఆర్ కార్యాలయానికి వచ్చి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికి రత్నాకర్ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి కశింకోట మండలం మాజీ కో-ఆప్షన్ సభ్యులు వేగి దొరబాబు, నర్సింగబిల్లి టిడిపి కార్యకర్త బెజవాడ రాజు పాల్గొన్నారు.

కొణతాలకు మద్దతుగా సంచార టీ దుకాణం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతుగా వినూత్న రీతిలో సంచార టీ దుకాణాన్ని ఆయన అభిమానులు ఏర్పాటు చేశారు. గౌరీ పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు కర్రి మహాలక్ష్మి నాయుడు, జనసేన నాయకులు తాడి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ సంచార టీ దుకాణాన్ని రింగ్ రోడ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో అభ్యర్థి కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు .ఈ సంచార దుకాణం పట్టణంలో అన్ని చోట్ల తిరుగుతూ గాజు గ్లాసులో టీ పంపిణీ చేస్తూ గ్లాసు గుర్తును విస్తృత ప్రచారం చేయనున్నట్లు మహాలక్ష్మి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నారపిన్ని చంద్రశేఖర్, అడపా నరసింహమూర్తి, చక్రవర్తి పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచామన్నారు. చిన్న పిల్లలు బయట తిరగకుండా తల్లిదండ్రులు చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో అన్ని రకాల సర్జరీలు చేస్తున్నామని చెప్పారు. జనరల్ ఫిజీషియన్, చిన్న పిల్లల వైద్యులు తప్ప పూర్తిస్థాయిలో డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రతి బుధవారం గర్భిణీ స్త్రీలకు ప్రత్యేకంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండటంతో దేవరాపల్లి, వేపాడ, చీడికాడ తదితర దూర ప్రాంతాల నుండి రోగులు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి కాన్పుకు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.4000 తల్లికి అందించడం జరుగుతుందన్నారు. ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నట్లు ఆమె తెలిపారు.

సమిష్టి కృషితో మాడుగులలో గెలుస్తా

మాజీ మంత్రి బండారు వెల్లడి

ప్రజాశక్తి - మాడుగుల : మాడుగుల నియోజకవర్గ ఉమ్మడి పార్టీ అభ్యర్థి మార్పు జరిగే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గురువారం అకస్మాత్తుగా బండారు సత్యనారాయణ మూర్తి, గవిరెడ్డి రామానాయుడు, పివిజి కుమార్‌లతో కలిసి మాడుగుల మోదమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మాడుగులలో పర్యటించానని, ఈ నియోజకవర్గంలో ఎంతో అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో తాను చదువుకున్నానని, ఇక్కడ ఎందరో స్నేహితులు, బంధువులు ఉన్నారన్నారు. ఇన్నేళ్ల తన అనుభవంతో మాడుగుల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. సుమారు వెయ్యి మంది కార్యకర్తలతో మాడుగుల మండలం ముకుందపురం గ్రామం నుండి ఘాట్ రోడ్ జంక్షన్ మీదుగా మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వరకు ర్యాలీని నిర్వహించారు. త్వరలోనే అధికారికంగా సమావేశం ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సురేష్ నాయుడు, చోడవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బత్తుల తాతయ్యబాబు, మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న బండారు

కురుస్తున్న వడగళ్ల వాన

గ్రామాల్లో వడగళ్ల వాన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం వడగళ్ళ వాన కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు ఎవరూ బయటకు రావడానికి సాహసించ లేదు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మార్పు చెంది వడగళ్ల వాన కురవడంతో ప్రజలు సేదతీరారు.



నగదు ఇస్తున్న సంస్థ సభ్యులు

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చీడికాడ: మండలంలోని దండి సురవరం గ్రామంలో అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమైన బాధితుడు బత్తిన గంగరాజు కుటుంబాన్ని స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్" నిర్వాహకులు గురువారం పరామర్శించారు. రూ.10000ల ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యుడు పెంకి శివ మాట్లాడుతూ, ప్రతినెలా కొంత మందికి ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గోపి, రాజేంద్ర ప్రసాద్, చంద్రశేఖర్, తలుపులయ్య పాల్గొన్నారు.

సిఐలకు సూచనలు ఇస్తున్న డిఎస్‌పి

పటిష్ట బందోబస్తు : డిఎస్‌పి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో తహసీల్దార్ కార్యాలయం కేంద్రంగా గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావడంతో భద్రతా పరంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చర్యలు చేపట్టాలని డిఎస్పి అప్పారావు అన్నారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం పరిసర ప్రాంతాలను ఆయన ముగ్గురు సిఐలతో కలిసి పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్ దాఖలు చేసే రోజుల్లో భద్రతా పరంగా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో 5 గురును మాత్రమే మెయిన్ గేటు నుండి కార్యాలయానికి అనుమతించాలని, అనుచరులను దూరంగానే ఆపేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు విజయకుమార్, అప్పన్న, అప్పలరాజు పాల్గొన్నారు.

కూలీలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఏపీవో గంగునాయుడు కోటవురట్ల చెరువులో పనిచేస్తున్న కూలీలను కలిసి వేసవి జాగ్రత్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం 5 గంటల నుండి పనులు ప్రారంభించాలని, సాయంత్రం సమయంలో కూడా పనులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 25 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని, సుమారు 1024 గ్రూపులకు 820 వరకు గ్రూపులు పని చేస్తున్నాయన్నారు. మండల వ్యాప్తంగా 8,400 మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారని తెలిపారు. వీరికి రోజుకి సగటున రూ.290 వరకు వేతనాలు చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఐదు కిలోమీటర్లు దాటి ప్రయాణించిన కూలీలకు రూ.35 ప్రయాణ చార్జీలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట విఆర్‌పి అనిత ఉన్నారు.

మాట్లాడుతున్న ఎపిఒ

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చోద్యం గ్రామంలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను గురువారం గొలుగొండ వైద్య సిబ్బంది అందజేశారు. అనంతరం ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కూలీలందరూ ఉదయమే పనికి వచ్చి ఎండ దెబ్బ తగలకుండా వెళ్లిపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ రాధిక పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇస్తున్న వైద్య సిబ్బంది

టిడిపి హయాంలో డ్వాక్రా రుణమాఫీ ఏదీ?

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:అయ్యన్న, విజయ్‌లను నమ్ముకుంటే నర్సీపట్నం నాశనమేనని నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ 27వ వార్డులో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా మేలుకో పేరుతో టీడీపీ నాయకులు మహిళల కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అప్పట్లో ఎంత మందికి మాఫీ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. 2014లో మహిళలకు సెల్ ఫోన్లు ఇస్తామని చెప్పారని నర్సీపట్నం నియోజకవర్గంలో ఎంత మందికి ఇచ్చారో అయ్యన్నపాత్రుడు చెప్పాలన్నారు. ఆడ బిడ్డ పుడితే 30వేలు ఇస్తామని చెప్పారని, ఇంత మందికి ఇచ్చారో చెప్పాలన్నారు. కాబట్టే మహిళలు మేల్కొని 2019 ఎన్నికల్లో మిమ్మల్ని తొక్కారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు ఇన్‌చార్జ్ కొణతాల అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనిత ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల, దొండవాక గ్రామాల్లో గురువారం కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఉపాధి కూలీలతో కలిసి పని చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కురుందాసు నూకరాజు, మెరుగు నాగేశ్వరరావు, తాతారావు, గింజాల లక్ష్మణరావు, జనసేన నాయకులు బోడపాటి శివదత్ పాల్గొన్నారు.

కోటవురట్ల:మండలంలోని జగ్గంపేట అన్నవరం గ్రామాల్లో కూటమి పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో జగంపేట గ్రామానికి శాశ్వత రహదారి ఏర్పాటు చేశానని ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జానకి శ్రీను, నాయకులు జనార్ధన్, తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, బికెపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, సత్యంబాబు, బాబ్జి పాల్గొన్నారు.

నమస్కరిస్తున్న అనిత

తొలిరోజు నామినేషన్లు నిల్

ప్రజాశక్తి -నక్కపల్లి:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసారు. ఈ మేరకు నోటీసు బోర్డులో ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శించారు. 18వ తేదీ నుండి ఏప్రిల్ 25వ చేసి వరకు పని దినాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. గురువారం తొలి రోజు నాడు నామినేషన్లు దాఖలు కాలేదని ఆర్‌ఓ గీతాంజలి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ శ్రీకాంత్, డి.ఎస్.పి అప్పారావు, సిఐ విజయ్ కుమార్, నియోజకవర్గ ఎన్నికల అధికారులు, ఎలక్షన్ డిటి చైనులు పాల్గొన్నారు.

ప్రదర్శిస్తున్న ఆర్‌ఓ గీతాంజలి

కేన్సర్‌పై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి- కోటవురట్ల:గ్రామీణ ప్రాంతాల వాసులు కేన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించాలని హోమి బాబా కేన్సర్ ఆసుపత్రి వైద్యులు తరుణ్ ప్రసాద్, మన్స్ చంద్రాణి సూచించారు. కొడవటిపూడి ప్రాథమిక వైద్య కేంద్రంలో గురువారం పరిసర ప్రాంత వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రొమ్ము, గర్భాశయ, నోటి, క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి లక్షణాలు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ తరుణ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల కొడవటిపూడి వైద్య సిబ్బందికి హోమి బాబా (అగనంపూడి) కేన్సర్ ఆసుపత్రిలో లక్షణాలు గుర్తించడంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సిబ్బంది అనుమానితులను గుర్తించి ప్రాథమికంగా స్క్రీనింగ్ టెస్ట్ లో నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు కేన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలు ఉంటే వైద్య సిబ్బందితో పరీక్షలు నిర్వహించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యులు సంతోష్ కుమార్, ఎంపిహెచ్‌ఇ గోవిందరావు పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యురాలు

మట్టి నాణ్యతపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:వృత్తి విద్యతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు త్వరితగతిన లభిస్తాయని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామప్రతాప్‌రావు, వృత్తి విద్యా ఉపాధ్యాయులు పి.విష్ణు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు వృత్తి విద్య పై అవగాహన కల్పించారు. వృత్తి విద్యతో కలిగే ఉపాధి, ఉద్యోగ అవకాశాలను వివరించారు. దొండవ గ్రామంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ బి.రజిత విద్యార్థులకు మట్టి నాణ్యత, విత్తనాల నాణ్యత, మొక్క పెరుగుదల, రసాయనిక ఎరువులు, చీడపురుగులు నిర్మూలన, ఆధునిక పద్ధతిలో వ్యవసాయంపై 12 రోజులు శిక్షణ ఇచ్చారు.

సీతానగరంలో ఇంటింటా స్ప్రేయింగ్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలం గొడిచెర్ల పీహెచ్‌సి పరిధి సీతానగరంలో గురువారం వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ చేశారు. గతంలో ఈ గ్రామంలో ఒక డెంగ్యూ కేసు నమోదైంది. కేసులు నమోదైన గ్రామాల్లో ఏడాదికి రెండు పర్యాయాలు అవసరమైన స్ప్రేయింగ్ చేయాలని జిల్లా వైద్యాధికారి ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా మలేరియా అధికారి వి.దొర, యలమంచిలి సబ్ డివిజన్ ఆఫీసర్ నాయుడు, పర్యవేక్షణలో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేశారు.

'జైభీమ్ రావ్ భారత్' అభ్యర్థిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలో సీనియర్ దళిత నాయకుడిగా గుర్తింపు పొందిన నేతల నాగేశ్వరరావు గురువారం ఉదయం జైభీమ్ రావ్ భారత్ పార్టీ(జెబిపి)లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్ విజయవాడలో పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. నర్సీపట్నం అసెంబ్లీ బరిలో పార్టీ తరపున నిలబడేందుకు బీ-ఫారంను కూడా అందుకున్నారు.

ప్రచారంలో ముత్తంశెట్టి

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

తగరపువలస : సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే తన విజయానికి దోహదపడతాయని వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం, పెద నాగమయ్యపాలెంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం అమలు చేసినట్లు తెలిపారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని వివరించారు. కుల మతాలకు, రాజకీయ పార్టీలకతీతంగా అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలను అందించినట్లు తెలిపారు. మే 13 న జరుగు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, విశాఖ లోక్ సభ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ లక్ష్మిని గెలిపించాలని కోరారు.

వైసిపిలో నాయీబ్రాహ్మణుల చేరిక

జివిఎంసి 98వ వార్డులోని పలువురు నాయీ బ్రాహ్మణులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన వైసిపిలో చేరారు. వారికి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

మధురవాడలో..

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి ఆర్‌టిసి కాలనీలో భీమిలి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్‌టిసి కాలనీలో సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 90 శాతానికి పైగా ప్రజలు జగన్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. భీమిలి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిచి జగన్మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని చెప్పారు.

ఐక్యమత్యంతో పోరాటం ముందుకు

ప్రజాశక్తి- గాజువాక : ఐకమత్యంతో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదాని గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన ఆందోళన గురువారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. పోర్టు ప్రధాన గేటు వద్ద ఆందోళన కొనసాగింది. దీనికి ముందుగా బుధవారం రాత్రి నిర్వాసితులతో చర్చలు జరిపారు. కార్మికులు రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం మాత్రం నిర్వాసిత కార్మికులందరూ నష్టపరిహారం తీసుకోవాలని షరతు పెట్టింది. దీనికి కొంతమంది కార్మికులు ఆసక్తి చూపలేదు. కొంతమంది తీసుకుంటామన్నారు. నష్ట పరిహారం విషయం ఎంత అనేది యాజమాన్యం స్పష్టంగా చెప్పకుండా కాలయాపన చేస్తోంది. నిర్వాసితుల మధ్య ఐక్యత దెబ్బతీయడానికి కార్మికులందరూ నష్టపరిహారం తీసుకోవాలని యాజమాన్యం డిమాండ్ పెట్టింది. దీంతో చర్చలు అసంపూర్తిగా మిగిలాయి. జిల్లా పోలీసు యంత్రాంగం, రెవెన్యూ యంత్రాంగం చర్చలకు ముందుకొస్తున్నప్పటికీ, అదాని యాజమాన్యం జరగనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో ఆందోళన కొనసాగుతుంది.

యాజమాన్యం నిర్లక్ష్యంపై కొవిరి అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికుల పట్ల బెదిరింపు చర్యలను యాజమాన్యం విడనాడాలని కోరారు. అదాని యాజమాన్యం భయభ్రాంతులకు గురిచేస్తే కార్మికులు భయపడేది లేదన్నారు. కార్మికుల మధ్య ఐక్యమత్యాన్ని దెబ్బ కొట్టాలని యాజమాన్యం ప్రయత్నిస్తుందన్నారు.

ఆందోళన కొనసాగిస్తున్న కార్మికులు

బొగ్గు సమస్య పరిష్కరించాలి

దీక్షలో కూర్చున్న ఎన్.రామారావు, డి.ఆదినారాయణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : బొగ్గు కొరత చూపి స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల వైపునెట్టాలని చూస్తున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్య తీరును విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఖండించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 1162వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఇఎస్‌ఎఫ్, ఇఆర్‌ఎస్, ఇఎమ్‌డి సేఫ్టీ, విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు, కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి రోజురోజుకూ దారుణంగా తగ్గిపోతుందన్నారు. దీనివల్ల కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం కల్పించుకొని బొగ్గు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.రామారావు గంగాధర్, గోవింద్, బుంజిబాబు, గణేష్, సుమన్, రామ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను మోసం చేసిన మోడీ

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గంగాధర్

ప్రజాశక్తి -అనకాపల్లి

నిరుద్యోగ యువతను ప్రధాని నరేంద్ర మోడీ మోసగించారని అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్.గంగాధర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం దళిత బహుజన కోలనీలో పర్యటించారు. పది సంవత్సరాల క్రితం బిజెపి తన మేనిఫెస్టోలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిందని, పదేళ్లలో ఆ 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చిందని ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో ఉందని, మోడీ ప్రభుత్వం వాటి గురించి మాట్లాడకుండా మతం పేరుతో రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విశాఖ రైల్వే జోన్, విభజన హామీ చట్టాల అమలు వంటి ఏ ఒక్క హామీనీ బిజెపి అమలు చేయలేదన్నారు. దేశ రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నాలు బిజెపి తీవ్రస్థాయిలో చేస్తుందని తెలిపారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకొనేందుకు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు కట్టుమూరి నూక అప్పారావు, దాసరి సంతోష్, సనేడ గజ్జాలు, ఎగ్గాడ భాస్కర్ రావు, దళిత నాయకులు పూజారి నర్సయ్య, భూపతి కృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకుడు కొల్లి సత్యారావు, నందికి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జనసేన అభ్యర్థి కొణతాల నామినేషన్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొణతాల రామకృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. స్థానిక రింగ్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద నుంచి భారీ ఎత్తున ఊరేగింపుగా గుండాల జంక్షన్ ఉన్న ఆరో కార్యాలయానికి చేరుకొని శుక్రవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయడం జరుగుతుందని కొణతాల రామకృష్ణ విలేకరులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని జనసేన, టిడిపి, బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొణతాల నామినేషన్‌కు తరలిరండి

జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణ తెలుగుదేశం పార్టీ సమావేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో గురువారం డాక్టర్ నారాయణరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట్ని రామకృష్ణ బోడి వెంకట్రావు, పొలిమేర నాయుడు, గుడాల సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, కొణతాల రత్నకుమారి, కాయల ప్రసన్న, మల్ల గణేష్, కర్రి మల్లేశ్వరరావు, రీసా అప్పలాచారి, బుద్ధ కాశీ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-మునగపాక : ఎన్నికల ప్రచారంలో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మండల కేంద్రం మునగపాకలో ఉపాధి కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎలమంచిలి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కన్నబాబురాజును, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, నాయకులు మల్ల సంజీవరావు, టెక్కలి కొండలరావు, పొలిమేర గణేష్, పెంటకోట సత్యనారాయణ బోడకుర్తి గణేష్, పిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభను జయప్రదం చేయండి

24న నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సిద్ధం యాత్ర సందర్భంగా ఈనెల 20న తాళ్లపాలెం గ్రామ సమీపంలో జరగనున్న సభను జయప్రదం చేయాలని వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో అనకాపల్లి మండల కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 24న తనను నామినేషన్ దాఖలు చేస్తానని, దానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ సత్యవతి, రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వైస్ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి,

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న వైవి.సుబ్బారావు, భరత్, బూడి

ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు జాజుల రమేష్, బొడ్డేడ శివ, ఆళ్ల నాగేశ్వరరావు, పెద్దిశెట్టి గోవింద, విల్లూరి సూర్య కుమారి శేఖర్, ఉగ్గిన అప్పారావు, సూరిశెట్టి రమణ అప్పారావు, మంత్రి సత్తిబాబు, నోట్ల శ్రీనివాసరావు, పల్లెల సాయి పాల్గొన్నారు.

సిద్ధం సభ స్థలాన్ని పరిశీలిస్తున్న వైవి సుబ్బారెడ్డి

కశింకోట : కసింకోట మండలం, తాళ్లపాలెం గ్రామ సమీపంలో ఈనెల 20న జరగనున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభ స్థలాన్ని గురువారం వైసిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వైవి సుబ్బారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతమ్మ, ఎలమంచిలి శాసనసభ్యులు కన్నబాబు రాజు, నాయకులు పలక రవి, గొల్లవిల్లి శ్రీనివాసరావు, మలసాల కిషోర్ ఉన్నారు.

వైసిపిలో చేరిన జనసేన నాయకులు

అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక గ్రామానికి చెందిన జనసేన నాయకుడు చౌడుపల్లి అప్పారావు తన అనుచరులతో కలిసి గురువారం స్థానిక ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి యువి.రమణమూర్తిరాజు సమక్షంలో వైసీపీలో చేరారు. రాజన్న పాలెం గ్రామానికి చెందిన గండి అప్పారావు తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన ఎమ్మెల్యే కండువాలు వేసి సాధారంగా ఆహ్వానించారు.